క్లుప్తంగా

జిమ్ ప్రారంభం



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, పక్కన వినయ్, డీఎస్పీ చంద్రభాను, చైర్మన్ డీవీ

ఇల్లెందు: పట్టణంలోని 24 ఏరియాలో వినయ్ చాలెంజర్ జిమ్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ కాలంలో ప్రతీ వ్యక్తి ప్రతీరోజు ఓ గంట వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరం అని ఇందు కోసం జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, కోరం సురేందర్, సారయ్య, కిరణ్, అంకెపాక నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను చేపట్టారు. ఆదివారం కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు చంద్రశేఖర్, శ్రీనివాస్, టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్, 1104 జెన్‌కో అధ్యక్షులు కేశబోయిన కోటేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా రాంచందర్



ఇల్లెందు: సీపీఐ అనుబంధ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇల్లెందుకు చెందిన గుగులోతు రాంచందర్‌కు అవకాశం దక్కింది. ఆదివారం ఇల్లెందులో జరిగిన పార్టీ 3వ మహాసభలో రాంచందర్ ఎన్నుకున్నారు. ఈ మేరకు సీపీఐ జిల్లా నాయకులు కె.సారయ్య, ఏఐటీయూజీ బ్రాంచీ కార్యదర్శి నజీర్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ... ఇల్లెందు ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మొర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో బీసీఎం రోడ్‌లో ట్రాక్టర్‌ను ఎస్‌ఐ రాఘవయ్య పట్టుకుని స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమాని నాగ మురళీ కృష్ణ, డ్రైవర్ లచ్చిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించండి..

జూలూరుపాడు: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడు, పడమటనర్సాపురంలోని ప్రభుత్వ హాస్టళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. పెంచిన కాస్మొటిక్, మెస్ చార్జీలను ఈనెల నుంచే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా వ్యాప్తంగా అద్దెభవనాల్లో నడుస్తున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, చలికాలం దృష్ట్యా హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సాయితేజ, రామ్ చరణ్, పునీత్ కుమార్, హేమంత్ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించండి..



మాట్లాడుతున్న హరికృష్ణ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లాలోని మెడికల్ కళాశాలలో ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కాకుండా కాంట్రాక్ట్ పద్ధతిలో నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగులను భర్తీ చేయాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ మైనార్టీ గురుకులాలలో కూడా ఈ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారానే ఉద్యోగులు ఇప్పిస్తామని రూ.లక్షలు, ఏజెన్సీ వాళ్లు సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టి అన్నిరకాల విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతుల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగాల పేరుతో యువతను మోసగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బస్టాండ్‌లో సమస్యల తిష్ట..

- దాహం తీరదు.. ఆహారం లభించదు
- ఏళ్లుగా తెరుచుకోని హోటల్
- వెలగని లైట్లు
- ప్రైవేటు వాహనాల పార్కింగ్
- ఇల్లెందు బస్టాండ్ దుస్థితి మారేనా?



ఇల్లెందు బస్టాండ్‌లో మూసివేసిన హోటల్

ఇల్లెందు: ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్‌లో హోటల్ ఐదేళ్ల క్రితం మూతపడింది. ప్రయాణికులకు దాహం తీరే దారి లేదు. ఆహారం అందుబాటులో ఉండటం లేదు. ఇక్కడి నల్లాల్లో చుక్క నీరు రావటం లేదు. ఫ్యాన్‌లు కూడా సక్రమంగా తిరగటం లేదు. ఇదిలా ఉండగా పెవైటు వాహనాలకు పార్కింగ్‌గా మారింది. ఆటోలు, టాటా మ్యాజిక్‌లు, ఇతర వాహనాలు బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను తరలించుకు వెళ్తుంటాయి. రెగ్యులర్ కంట్రోలర్ లేని కారణంగా బస్టాండ్ దుస్థితి దుర్భరంగా మారింది. ఆర్టీసీ అధికారులు ఆదాయం కోసం ఆరాట పడుతున్నారు. కానీ సదుపాయాలను పట్టించుకోవటం లేదు. ఇల్లెందు బస్టాండ్‌కు ఒకవైపు ప్రహరీ లేదు. క్రమక్రమంగా బస్టాండ్ ఆవరణ అంతా ఆటోలు, మ్యాజిక్‌లు, జీపులు, లారీలతో నిండిపోతోంది. ఈ వాహనాలకు బస్టాండ్ ఆవరణే అడ్డాగా మారింది. అసలే ఇరుకు ప్రదేశం, ఆపై ప్రైవేటు వాహనాలు అడ్డాగా పెట్టి ఇష్టారాజ్యంగా రోడ్డు మీద వాహనాలు నిలపడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. బస్టాండ్ ఆవరణలో సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి, మూత్రశాలలు, మరుగుదొడ్లు సక్రమంగా పని చేయటం లేదు. మున్సిపాల్టీ ద్వారా పక్కనే నిర్మించిన వాటిని వాడుకుంటున్నారు. ఇక నీటిగోస తీరటం లేదు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు తాగునీరు అందుబాటులో లేదు. బస్సుల సమాచారం తెలుసుకునేందుకు కనీసం ఫోన్ నంబర్ కూడా అందుబాటులో లేదు. బస్టాండ్ ఎదుట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లే అవుట్, ఇన్ బోర్డులు ఏర్పాటు చేయక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, గుండాల, మర్కోడు, వరంగల్, కరీంనగర్, మహబూబాబాద్, నర్సంపేట, హైదరాబాద్‌కు ఇల్లెందు నుంచి బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్టీసీకి అంతో ఇంతో ఆదాయం సమకూరే ఏకైక బస్టాండ్ ఇల్లెందే. ఇంతటి ఆదాయ వనరు కలిగిన బస్టాండ్ పట్ల నిర్లక్ష్యం తగదని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు సూచిస్తున్నారు. ఇల్లెందు బస్టాండ్‌లో కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

వయా ఇల్లెందు మళ్లిస్తే...

ఇల్లెందు బస్ డిపో తయారైన తర్వాత హైదరాబాద్‌కు బస్‌లు పెంచారు. కానీ మధ్యాహ్నం అత్యవసరం అయితే బస్‌లు మాత్రం ఉండవు. అందుకు వయా ఇల్లెందు నుంచి హైదరాబాద్‌కు వెళ్లేలా భద్రాచలం, మణుగూరు డిపోల బస్‌లు కొన్నింటిని మళ్లిస్తే ఉపయోగంగా ఉంటుంది. హైదరాబాద్‌కు వెళ్లే ఏసీ బస్‌లు ఉదయం రెండు సర్వీసులు, సాయంత్రం రెండు సర్వీస్‌లు వయా ఇల్లెందు మీదుగా వెళ్లేలా మళ్లించాల్సి ఉంది. భద్రాచలం, మణుగూరు నుంచి ప్రతీరోజు చాలా బస్‌లు హైదరాబాద్ వెళ్తున్నాయి. కొత్తగూడెం నుంచి తల్లాడ, వైరా మీదుగా వెళ్లే బస్‌లను వయా ఇల్లెందు మీదుగా మళ్లిస్తే కొద్ది తేడాతో దూరం ఉంటుంది.

బంక్ లేక ఇక్కట్లు..

ఇల్లెందులో బస్ డిపో ఏర్పాటు చేసి రెండేళ్లు కావస్తోంది. డిపోలో బంక్ ఏర్పాటును మరిచారు. బంక్ లేకపోవటం వల్ల ఆయిల్ కోసం ప్రతీ బస్ కొత్తగూడెం డిపోకు వెళ్లాల్సి వస్తోంది. ఆయిల్ అందుబాటులో లేక ప్రయాణికులకు గమ్యానికి సకాలంలో చేర్చలేకపోతున్నారు. ప్రతీ బస్ ప్రతీరోజు కొత్తగూడెం వెళ్లి ఆయిల్ నింపుకుని రావాల్సి వస్తోంది.



నిరుపయోగంగా నల్లాలు

తెరుచుకోని హోటల్..

ఇల్లెందు బస్టాండ్‌లో హోటల్ ఐదేళ్లుగా మూతపడే ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు హోటల్ కోసం బయటకు వెళ్లి వస్తున్నారు. బయటకు వెళ్లి రావటం వల్ల బస్‌లు వెళ్లిపోతున్నాయి. దీంతో గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. బస్ డిపో ఏర్పడిన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరిగింది. డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ, మెకానిక్‌లు భోజనానికి బయటకు వెళ్లి రావాల్సి వస్తోంది. తక్షణం బస్టాండ్‌లో హోటల్ ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



ఇల్లెందు బస్టాండ్‌లో సమస్యలను అధికారులు పరిష్కరించాలి. ఆర్టీసీ డీఎం, ఆర్‌ఎంలు స్థానిక ప్రజాప్రతినిధులతో బస్టాండ్‌లో మీటింగ్ ఏర్పాటు చేస్తే సమస్యలు చెప్పుకుంటారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తే ఆర్టీసీ ఆదాయం పెరుగుతుంది. – దిండిగల రాజేందర్, ఇల్లెందు

సదుపాయాలు కల్పించాలి..



బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు రాకుండా అడ్డుకోవాలి. బస్టాండ్‌లో సదుపాయాలు పెంచాలి. షాపింగ్ కాంప్లెక్సులు అన్ని వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. రెగ్యులర్ కంట్రోలర్‌ను నియమించాలి. ఇల్లెందు డిపోకు పూర్తి స్థాయి మేనేజర్‌ను నియమించాలి. – నాళ్ల సోమసుందర్

తాగునీరు ఏర్పాటు చేయాలి..



సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులకు కనీస సదుపాయాలు కలిపించాలి. బస్టాండ్‌లో తాగునీరు, బల్లలు ఏర్పాటు చేయటం, లైట్లు, ఫ్యాన్ల ఉపయోగంలోకి తీసుకరావాలి. మరుగుదొడ్లు పని చేయటకపోవటం వల్ల ప్రయాణికులు బయటకు వెళుతున్నారు. – హరికృష్ణ, ఇల్లెందు

కంట్రోలర్‌ను నియమించాలి..



బస్టాండ్‌లో రెగ్యులర్ కంట్రోలర్‌ను ఏర్పాటు చేయాలి. బస్‌ల సమాచారం అందించేలా ఒక ఫోన్ నంబర్‌ను కూడా ఏర్పాటు చేయాలి. అవుట్ ఇన్ బోర్డులు కూడా పెట్టాలి. ప్రైవేట్ వాహనాలు లోనికి రాకుండా సెక్యూరిటీ గార్డును నియమించాలి.

– చింతా ఉపేందర్, సుదిమళ్ల

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచ పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన బి.శ్రీనివాస్, రాధిక దంపతులు రూ.5,116. విరాళాలు అందజేసినట్లు ఆలయఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

హెచ్‌ఎంల సంఘం ఎన్నిక



బాలాజీ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నికలు ఆదివారం కొత్తగూడెంలో జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా బి.బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏ.పద్మలత, కోశాధికారిగా పి.జగపతయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణాధికారిగా ఆర్.వీరస్వామి వ్యవహరించారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల జిల్లాలోని హెచ్‌ఎం హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందు: కొత్త కాలనీలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులు షేక్ యాకుబ్‌పాషా, చాంద్‌పాషాల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెపర్డ్, శ్రీ సత్య లయన్స్ చారిటబుల్ కంటి హాస్పిటల్ మానుకోట ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ రొయ్యూర్ సురేష్, డాక్టర్ ధరావత్ రెడ్డి నాయక్, నేత్ర వైద్య సహాయకులు అంగోతు అఖిల్ కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మంది ఈ శిబిరానికి హాజరై కంటి వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

ఏరియాలో డైరెక్టర్(పా) పర్యటన



ఓసీ ప్రారంభించనున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి ఆదివారం ఇల్లెందు ఏరియాలో పర్యటించారు. కేటీసీ, జేకే ఓసీలో పర్యటించిన ఆయన అక్కడి పనులను ఏరియా జీఎం జాన్‌ఆనంద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓసీ పని స్థలాలలను సందర్శించి రోజు వారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, బొగ్గు బ్లాస్టింగ్, లోడింగ్ వివరాలను తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తి, రోజు వారీ రవాణాను అధిగమించాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని, సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కోరారు. అనంతరం నూతన జేకే ఓసీ ప్రారంభించే స్థలాన్ని పరిశీలించారు. జీఎం చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జేకే ఓసీ మొదటి దశ అనుమతులు వచ్చాయన్నారు. తదుపరి అనుమతుల కోసం చేయావల్సిన పనుల కోసం అధికారులకు తగు సలహాలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏరియా జీఎం జాన్‌ఆనంద్, జీఎం(సీపీపీ) మనోహర్‌రెడ్డి, జీఎం(పీపీ) సాయిబాబు, జీఎం (హెచ్‌ఆర్‌డీ) ఇ.కృష్ణయ్య, ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ఏజీఎం (ఐఈ) గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణమోహన్, రామస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: జూలూరుపాడు నుంచి పడమటనర్సాపురం వరకు 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాపకొల్లు, పడమటనర్సాపురం విద్యుత్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని, కావున వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

బీఎస్పీ పట్టణ అధ్యక్షుడిగా ఆనందరావు



నియామకపత్రం అందుకుంటున్న ఆనందరావు

పాల్వంచ: బీఎస్పీ పట్టణ అధ్యక్షుడిగా పాల్వంచకు చెందిన జెట్టి ఆనందరావు నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు నియామక పత్రాన్ని అందించారు. మాట్లాడుతూ.. బీఎస్పీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, ఎందరో మహనీయుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

రైతులను దగా చేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

జూలూరుపాడు: రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా, పంటలకు రూ.500 బోనస్ ఇవ్వకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి జి.మధుసూధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జూలూరుపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాయమాటలు చెపుతూ కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే, సరైన దిగుబడి రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అన్ని పంటలకు మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం సన్న వడ్లకు ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర రూ.2,321 ఇస్తుంటే ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటనీ ప్రశ్నించారు. మిల్లర్లు, దళారులు కలిసి రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే డిసెంబర్ 1 నుంచి బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిలుకూరి రమేష్, నున్నా రమేష్, ఎం.సతీష్, తెల్లం నరసింహారావు, సిరిపురపు గోపాల్ రావు, వందనపు సుబ్బు, నిమ్మటూరి రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

పాల్వంచ: డిసెంబర్ 26 నాటికి సీపీఐ పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వాడవాడలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, పార్టీ చరిత్రను, త్యాగాలను ప్రజలకు వివరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో పట్టణ కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... 2025 సభ్యత్వాలు, పునఃరుద్ధరణ లక్ష్యాలను పూర్తి చేసి గ్రామ, మండల స్థాయి మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నియోజక వర్గంలో చేపడుతున్న అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వందలాది మంది పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇట్టి వెంకట్రావ్, ముత్యాల విశ్వనాథం, అడుసుమిల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇన్సాఫ్, అస్లాం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమణ



కబ్జాకు గురైన స్థలం

ఇల్లెందు: అధికారులు, రాజకీయ నాయకులు కళ్లు మూసుకుంటే కొంతమంది స్థలాల కబ్జాలకు తెరలేపుతున్నారు. పట్టణంలోని శ్రీ హరిహర క్షేత్రం వెనుక ఖాళీగా ఉన్న స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ఇటీవల గుట్టు చప్పుడు కాకుండా భూకబ్జా చేశారు. వెంటనే ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారు. ఈ స్థలంలో ప్రభుత్వ స్థలం అంటూ గతంలో బోర్డు కూడా పెట్టారు. స్థానికులు కొందరు బోగస్ ఇంటి పట్టాలు పట్టుకుని భూ ఆక్రమణకు పాల్పడ్డారు. ఈ ప్రదేశంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఒకవైపు ఆస్పత్రికి ఐదు ఎకరాల స్థలం, ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకులం కోసం మరో 5 ఎకరాల స్థలం కోసం వెతుకుతోంది. ఇక కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కూడా స్థలాలు లేక భవనాలు మంజూరు కావటం లేదు. సబ్ రిజిష్టార్ కార్యాలయం, అబ్కారీ కార్యాలయం, లేబర్ ఆఫీస్‌లకు స్థలాలు దొరకక అధికారులు తలలు పట్టుకుంటుండగా ఉన్న కొద్దిపాటి స్థలాలను కొందరు స్వాహా చేస్తున్నారు. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులను బురిడీ కొట్టించి స్థలాల ఆక్రమణపై స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేస్తే కఠిన చర్యలు

టేకులపల్లి: లైసెన్స్ లేకుండా గ్రామాల్లో పత్తి చిల్లర కొంటర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ గ్రేడ్ 3 కార్యదర్శి నరేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి టేకులపల్లిలో పత్తి కొనుగోలు చేస్తున్న చిల్లర కొంటర్లను తనిఖీ చేశారు. ప్రతీఒక్కరు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి రైతులను మోసం చేసే విధంగా కొనుగోళ్లు చేపడితే కేసు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఊపందుకున్న కుటుంబ సర్వే




ఇల్లెందులో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణం, మండలంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఊపందుకుంది. ఆదివారం పట్టణంలో 424 కుటుంబాలు, మండలంలో 520 కుటుంబాలను సర్వే చేశారు. సర్వే కోసం ఆయా ప్రాంతాలకు ఎన్యూమరేటర్లు వచ్చే ముందస్తు సమాచారం ఇవ్వకపోవటం వల్ల ప్రజలు పనులకు వెళ్లలేకపోతున్నారు. ఒక్కో ఇంటి వద్ద కనీసం 20 నుంచి 30 నిముషాల సమయం పడుతోంది. అయితే ఈ సర్వేలో పొందుపర్చిన ప్రశ్నల్లో చాలా వరకు ఉపయోగం లేని ప్రశ్నలు ఉన్నాయని ఎన్యూమరేటర్లు, సర్వే పూర్తయిన కుటుంబాల సభ్యులు పేర్కొంటున్నారు.

ఇల్లెందురూరల్: మండల, పట్టణ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ గణన రెండో రోజు ఆదివారం సాఫీగా సాగింది. మండలంలో మొత్తం 18,667 కుటుంబాలు, మున్సిపాలిటీ పరిధిలో 11,107 కుటుంబాలు ఉన్నట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. ఆయా కుటుంబాల సర్వే శనివారం నుంచి ప్రారంభం కాగా ఆదివారం కూడా కొనసాగింది. రెండు రోజుల సర్వేలో ఎన్యూమరేటర్లకు ఎదరైన అనుమానాలను నివృత్తి చేశామని, సోమవారం నుంచి సర్వే వేగవంతంగా సాగుతుందని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

భవనాలు శిథిలం.. బతుకు భయం భయం

- గోడలు బీటలు వారి.. పైకప్పు పెచ్చులూడి..
- కొత్త అంజనాపురంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న నివాస గృహాలు
- లక్ష్మక్కపేటలోనూ అదే సమస్య



కొత్త అంజనాపురంలో శిథిలావస్థకు చేరిన ఇల్లు



స్లాబులో చువ్వలు బయటకు కనిపిస్తున్న దృశ్యం

సుజాతనగర్: ఇక్కడి గిరిజనులకు ఎప్పుడు ఆపద ముంచుకొస్తుందో తెలియదు. ఇళ్ల పునాదులు సరిగా లేక, గోడలు బీటలుగా వారి.. పెచ్చులు ఊడిపడుతున్న స్లాబు, శిథిలమైన దర్వాజలు, కిటికీలు.. ఇలా ప్రతీ గూడు పగుళ్లతో శిథిలమై పోగా వాటిలోనే నివాసం ఉండాల్సిన కడు దయనీయ పరిస్థితి. ఎప్పుడో నిర్మించిన భవనాలు శిథిలమై కనిపిస్తున్నా...ఇప్పటికీ వాటిలోనే బతుకీడుస్తున్నా... కొత్త భవనాలు మాత్రం నిర్మించడం లేదు. ముఖ్యంగా వర్షాకాలంలో శిథిలావస్థ దశకు చేరిన ఇళ్లతో ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉండగా, వాటిలో నివసించే ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. వారంతా కూలి చేసుకొని జీవించే గిరిజనులే. గాలి, వర్షం వచ్చిన సమయంలో ఎక్కడ కూలి మీదపడతాయోనని భయం భయంగా గడుపుతున్నా కొత్త అంజనాపురం, లక్ష్మక్కపేట గ్రామాల్లోని గిరిజనులు.

భయం గుప్పిట్లో బతుకులు..

కొత్త అంజనాపురంలో ఆదివాసీ గిరిజనులు నివాసం ఉంటున్న గృహాలు శిథిలావస్థ దశకు చేరుకున్నాయి. సుమారు 30 ఏళ్ల క్రితం కలెక్టర్ కోటాలో కొన్ని గృహాలు, ఇందిరమ్మ పథకంలో మరికొన్ని గృహాలు మంజూరయ్యాయి. సుమారు 70 ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గిరిజనులు బిక్కుబిక్కుమంటూ వాటిలోనే జీవనం సాగిస్తున్నారు. భవనాల పెచ్చులు ఊడిపడుతుండటం, వర్షం వచ్చినప్పుడు కురుస్తుండటంతో భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదపుటంచున లక్ష్మక్కపేట వాసులు...

నాయకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మక్కపేట వాసులు సైతం ప్రమాదపుటంచున నివసిస్తున్నారు. గ్రామంలోని సుమారు 10 ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. రజబ్ అలీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ గృహాలను నిర్మించారు. స్లాబులకు పెచ్చులూడి లోపలి ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో ఈ శిథిల గృహాల్లోనే భయం భయంగా గడుపుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి..



30 ఏళ్ల నుంచి ఈ ఇళ్లలోనే ఉంటున్నాం. వర్షం, గాలి వస్తున్న సమయంలో ఇంట్లో ఉంటే ఎక్కడ కూలి మీదపడతాయోనని భయపడి ఆ సమయంలో బయటే ఉంటున్నాం. ఒక్కోసారి రాత్రంగా ఆరుబయటే నిద్రిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. – ముక్తి పాపమ్మ, కొత్త అంజనాపురం

ఎప్పుడు కూలుతాయో తెలియదు..



స్లాబులో నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఎప్పుడు కూలిపడతాయో అర్థం కావడం లేదు. ప్రభుత్వ అధికారులు ఒకసారి వచ్చి మా గృహాలను చూడాలి. సమస్య పరిష్కరించాలి. మా పేద గిరిజనులను ఆదుకోవాలి.

– ఇస్లావత్ కృష్ణకుమారి